సాక్షి సంగారెడ్డి

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



రమణీయం రంగనాయక సాగరం

చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. బుధవారం కేంద్ర ప్రభుత్వం చేతులమీదుగా సర్పంచ్ అవార్డు అందుకోనున్నారు.

వివరాలు 8లో ▸



'చెత్త' మనుషులు

బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేజీఆర్ కాలనీలో ఇక్కడ చెత్త వేయవద్దని జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

వివరాలు 9లో ▸

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిపేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 73828 30800 నంబర్‌లో సమస్యలు తెలపాలని సూచించారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

99498 49479

• వెల్లారా.. గణపయ్యా..



నారింజ ప్రాజెక్టులో నిమజ్జనానికి వినాయక ప్రతిమలు తరలుతున్నాయి. హౌసింగ్‌బోర్డు కాలనీలోని రుద్ర గణేశ్, పద్మశాలి సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిమలను ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తరలించారు. మార్గమధ్యలో చిన్నాపెద్ద చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళల దాండియా అలరించింది. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నడుమ పలు ప్రతిమలను నిమజ్జనం గావించారు. పట్టణంలో 70కి పైగా గణేశుడి ప్రతిమలను ప్రతిష్ఠించారు. గురువారంతో క్రతువు పూర్తి కానుంది.

– జహీరాబాద్ టౌన్

• ఫుల్ 'జోష్'



మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులంలో జరుగుతున్న 2వ జిల్లాస్థాయి 'జోష్' క్రీడా పోటీలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. బాలుర అండర్ –14 విభాగం కబడ్డీలో సంగారెడ్డి(కంది) జట్టు విజేత కాగా, నర్సాపూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్‌లో అల్గోల్ జట్టు విన్నర్ కాగా, అందోల్ గురుకులం రన్నరప్‌గా నిలిచింది. అండర్– 17 విభాగం వాలీబాల్‌లో గజ్వేల్ ప్రథమస్థానం, సిద్దిపేట రెండోస్థానంలో నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్‌లో సంగారెడ్డి గురుకులం, గజ్వేల్ వరుసగా ఫస్ట్, సెకండ్ ప్లేస్‌లు పొందాయి.

– జహీరాబాద్ టౌన్

పకడ్బందీగా ఓటరు జాబితా

- పారదర్శకంగా రూపొందించాలి
- అబ్జర్వర్ విజయేందిర
- జిల్లాలో విస్తృత పర్యటన



సీడీని ఆవిష్కరిస్తున్న విజయేందిర, శరత్

సంగారెడ్డి టౌన్ : పారదర్శకమైన తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడం చాలా కీలకమని ఓటర్ జాబితా అబ్జర్వర్, రోడ్లు భవనాల స్పెషల్ సెక్రటరీ విజయేందిర అన్నారు. మంగళవారం జిల్లాలోని పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్‌లో పర్యటించారు. ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులు, జాబితా రూపకల్పన తదితరాలను పరిశీలించారు. పలువురు బీఎల్‌ఓలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్లో పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఓటరు జాబితా చాలా కీలకమని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం రూపొందిస్తున్న జాబితాలో తప్పులు లేకుండా తయారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం బాగా పని చేస్తోందన్నారు. జిల్లాలో సెకండ్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాలు అన్ని బాగా జరుగుతున్నాయని ప్రశంసించారు. పటాన్‌చెరులో కొత్త కాలనీలు చాలా వెలశాయన్నారు. కాగా, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఫారం 6, 7, 8లు తీసుకుందన్నారు. దివ్యాంగుల ఓటర్లను మార్కింగ్ చేసిందని తెలిపారు. పొలిటికల్ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమం, స్వీప్ కార్యక్రమాలు, జాబితా రూపకల్పనకు చేపట్టిన చర్యలను కలెక్టర్ ఆమెకు వివరించారు. దివ్యాంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాలవారీగా మ్యాపింగ్ చేశామని, జిల్లాలోని ప్రతి కళాశాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన సీడీని విజయేందిర, శరత్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ నగేశ్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ డైరెక్షన్స్ మేరకు ఆసానికుంట, కాజిపల్లి గండిగూడెం, ఇస్నాపూర్, కిష్టారెడ్డిపేట్ చెరువు నీటి వనరుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శరత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీసీబీ మెంబర్ సెక్రటరీ కృష్ణ ఆదిత్యతో కలసి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసానికుంట పొల్యూషన్ సెడ్ మెంట్ జస్టిఫికేషన్ ప్రతిపాదనలను హైపవర్ కమిటీకి పంపాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌కు సూచించారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. ఎఫ్లెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ విషయమై ఎక్స్‌పర్ట్ కమిటీ అభిప్రాయాన్ని తీసుకోవాలని పీసీబీ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ నగేశ్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, ఎస్ఈ మురళీధర్, ఈఈ, పీసీబీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, చింతా ప్రభాకర్

భావితరాలకు స్ఫూర్తి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్ : ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. అందులో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారన్నారు. భావితరాలకు ఆమె స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో తానే కాదు తనతోపాటు అందరూ బాగుండాలని పెత్తందార్ల అరాచకాలకు ఎదురొడ్డి ధైర్యంగా పోరాడారని గుర్తుచేసుకున్నారు.

కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు చేసిన పలు ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని భరోసానిచ్చారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల నగేశ్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీరయ్య యాదవ్, అధికారులు, వివిధ కులసంఘాల ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతాలకతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): కుల, మత భేదాలు లేకుండా అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హుస్సెళ్లి గ్రామంలో రూ.14లక్షలు నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా అమలు చేయని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. దేశంలో ఎక్కడా కూడా లేని విధంగా రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, 24 గంటల ఉచిత కరెంట్ తదితరాలను అందిస్తున్నది కూడా తెలంగాణేనని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చేసేందుకు మంత్రి హరీశ్‌రావు సహకారంతో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, మురుగు కాల్వలు, పంచాయతీ భవనాలు, బీటీ రోడ్లు, పాఠశాల భవనాలు నిర్మించామన్నారు. బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తనను కూడా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు తన్వీర్ అహ్మద్, రవీందర్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల తిరస్కరణ సరికాదు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గవర్నర్.. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిస్కరించడం సరికాదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను సేకరించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేట్ చేయగా తిరస్కరణకు గురికావడం ఆవేదన కలిగించిందన్నారు. తమిళిసై మరోమారు పునరాలోచించాలని, అభ్యర్థిత్వాలను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

'టీబీ' కమిటీలు వేయాలి

- రాష్ట్ర క్షయ నివారణ అధికారి జితేంద్ర



సమావేశానికి హాజరైన అధికారులు

సంగారెడ్డి టౌన్ : టీబీ నివారణకు అందరూ కలసికట్టుగా రావాలని రాష్ట్ర క్షయ నివారణ (ఐయూసీ) ఆఫీసర్ జితేంద్ర, జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. పరిశ్రమలో పని చేసే కార్మికులపై దీని ప్రభావం ఎక్కువగా చూపుతోందన్నారు. పట్టణంలోని ఓ హోటల్ మంగళవారం టీబీ నివారణ అవగాహన కార్యక్రమంలో ఇండస్ట్రియల్ పాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్షయ నివారణకు పరిశ్రమల కృషి చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమిటీలు వేసుకొని తమ వంతుగా కృషి చేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. ఎన్టీఈపీ ద్వారా అనేక సేవలు అందుతున్నాయని వెల్లడించారు. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి చొరవ తీసుకోవాలన్నారు. టీబీ అలర్ట్ ఇండియా హెడ్ ప్రోగ్రామ్స్ సంస్థ రాష్ట్రంలో 37 లక్షల మందికి స్క్రీనింగ్ చేసిందన్నారు. అందులో 4,013 పాజిటివ్ కేసులు గుర్తించిందని చెప్పారు. అందరి సహకారంతో ఇది సాధ్యపడిందన్నారు. రాబోయే రోజులలో పరిశ్రమలు మరిన్ని ప్రణాళికలతో ముందుకు రావాలని టీబీ రాష్ట్ర టెక్నికల్ ఆఫీసర్ వాసు కోరారు. పరిశ్రమల ప్రతినిధులు భవిష్యత్‌లో అనేక చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అన్ని రకాలుగా సర్కారు సహకారం

గురుకుల విద్యాలయం రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ప్రమీలా నాయక్



మాట్లాడుతున్న ప్రమీలా నాయక్

హత్నూర (సంగారెడ్డి): గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు కష్టపడి చదివి ర్యాంకులు సాధించాలని రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల డిప్యూటీ సెక్రటరీ ప్రమీలా నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హత్నూరలోని గురుకుల పాఠశాల, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అందులోని వారు కష్టపడి చదివి రాష్ట్రానికి ఉత్తమ ర్యాంకులు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాలుగా సర్కారు సహకరిస్తోందని, ఉపాధ్యాయులు సైతం అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు వారి అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు.

చేనేతలకు శిక్షణ ఇప్పిస్తాం

అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి



విజయలక్ష్మి, చింతా ఆనంద్‌ను సన్మానిస్తున్న సంఘం నేతలు

సదాశివపేట(సంగారెడ్డి): చేనేత కార్మికులకు మగ్గం నడపటానికి శిక్షణ, నూతన లూమ్స్‌కు తన వంతు కృషి చేస్తానని జిల్లా చేనేత అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో చేనేత సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్మికుల వృత్తిపరమైన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వారికి అన్ని విధాలుగా సహకరిస్తానని హామీనిచ్చారు. తొలుత సంఘం చైర్మన్ చింతా గోపాల్ సభకు అధ్యక్షత వహించారు. ఆయన పలు సమస్యలను అసిస్టెంట్ డైరెక్టర్ దృష్టికి తెచ్చారు. తర్వాత సంఘం నూతన అధ్యక్షుడిగా చింతా ఆనంద్‌కుమార్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గడీల గణేశం, చిలువరి వెంకటేశం, రవికుమార్, రచన, సభ్యులు పోల ప్రభుకుమార్, చింతా ఆదర్శ్, నాగేశ్, మునిపల్లి విశ్వనాథం, మల్లేశం, అంబటి విశ్వనాథం, అడ్డగట్ల మనోహర్, అంజనేయులు, సిద్ధన్న, మేకల వీరప్ప, రుమాండ్ల రాజు, కొంగరి ప్రభు, మధునాల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10.51లక్షల పలికిన లడ్డూ

పటాన్‌చెరు: గణేశుడి లడ్డూకు వేలం వేయగా స్థానికుడు టీకేఆర్ గోపాల్‌రెడ్డి రూ.10.51 లక్షలకు దక్కించుకున్నాడు. మంగళవారం రాత్రి అమీన్‌పూర్ బీరంగుడ గుట్ట కామన్ వద్ద వేలం నిర్వహించారు. ఎప్పుడూ లేనంతగా ఈసారి ధర పలకడం విశేషం. మండప నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

అరుదైన గౌరవం.. అడుగు దూరం..

- బొల్లారం పీహెచ్‌సీ నిర్వహణపై ఎన్‌క్యూఏఎస్ బృందం సంతృప్తి
- త్వరలో ఆస్పత్రికి దక్కనున్న సర్టిఫికెట్



ఆస్పత్రి భవనం

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామికవాడలోని పీహెచ్‌సీలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతున్నది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనే పరిస్థితి నుంచి.. పోదాం పద బిడ్డో సర్కారు దవాఖానాకు' అన్నట్లుగా మెరుగైన సేవలు అందుతున్నాయి. ఇక్కడ రోజురోజుకు ఓపీలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రసవాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా హైరిస్క్ కేంద్రం అందుబాటులో ఉంది. ఆస్పత్రి లోపల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నారు. తగినంత వైద్యసిబ్బంది విధుల్లో ఉన్నారు. అంతేనా.. తాజాగా నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్స్ బృందం ఆస్పత్రిని సందర్శించి పలు అంశాలపై సంతృప్తి చెందింది. త్వరలో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ ప్రదానం చేయబోతోంది. అందుకు తగినట్లు నిధులు పుష్కలంగా ఆస్పత్రికి రానున్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 50 వేలకు పైగా జనాభా ఉంటారు. వివిధ రకాల పరిశ్రమలు 150 వరకు ఉన్నాయి. దేశంలోని అయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివాసముంటున్నారు. 80 శాతం మంది పరిశ్రమల్లో పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరందరికీ వైద్యసేవలు అందించడం సాధారణ విషయం ఏమీ కాదు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకుంటున్నారు. రోజూ ఓపీలు 100 నుంచి 300 వరకు వస్తుంటాయి.

అందుబాటులో హైరిస్క్ కేంద్రం

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు హైరిస్క్ కేంద్రం అందుబాటులో ఉంది. నెలనెలా ఎనిమిది వరకు డెలివరీలు జరుగుతున్నాయి. ఇక్కడ విధుల్లో ఒక వైద్యురాలు సహా 30 మంది సిబ్బంది ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో..

ఇటీవల బొల్లారంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్స్) బృందం సందర్శించింది. నాణ్యతా ప్రమాణాలను పాటించే తీరును పరిశీలించింది. సర్వీస్ ప్రొవిజన్, పేషంట్ రైట్స్, ఇన్‌పుట్స్, సపోర్టు సర్వీసెస్, క్లీనికల్ సర్వీసెస్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఇతర ఎనిమిది అంశాలను ఆ బృందంలోని ప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీకి 91.83 స్కోరింగ్ మార్కులు ఇచ్చారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా...

ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వైద్యురాలి గది, నర్సుల గది, ఆపరేషన్ థియేటర్, టాయిలెట్స్ వంటి వివరాలు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే అందుతున్న వైద్యసేవలు, పరీక్షలు, సమయపాలన ఇతర విషయాలు కూడా తెలిసేలా బోర్డులు పెట్టారు. అలాగే ఎప్పటికప్పుడు రోగులకు ఇబ్బందులు లేకుండా, ఎలాంటి దుర్గంధ వాసనలు రాకుండా పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. అలాగే ప్రస్తుతం 12 గంటలు మాత్రమే రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. రాత్రి సమయంలోనూ చాలా కేసులు వస్తున్నాయి. దీంతో 24 గంటలపాటు అందుబాటులోకి తేవాలని రోగులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మరింత అభివృద్ధికి ప్రణాళికలు



గతంతో పోలిస్తే ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరిగింది. అన్ని సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. పరిశ్రమల సహకారంతో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

రోజారాణి,
మున్సిపల్ చైర్‌పర్సన్

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



రోజూ ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అన్ని రకాల పరీక్షలను, ప్రసవాలను చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యం అందిస్తున్నాం.

రాధిక, ఆస్పత్రి వైద్యురాలు

దీంతో త్వరలోనే ఆస్పత్రి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ పొందనుంది. ఇది జరిగితే మూడేళ్లపాటు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా నగదు ప్రోత్సాహకాలు అందుతాయి.

చిరుధాన్యాలతో ఆర్థిక స్వావలంబన

నాబార్డు డీజీఎం శ్రీనివాసులు

జహీరాబాద్ టౌన్: మహిళలందరూ ఆర్థికంగా ఎదగాలని నాబార్డు డీజీఎం శ్రీనివాసులు ఆకాంక్షించారు. డీడీఎస్– కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీపై 15 రోజులుగా మహిళలు శిక్షణ పొందుతున్నారు. ముగింపు రోజైన మంగళవారం తన చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. 30 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలన్నారు. చిరుధాన్యాల విలువ ఆధారిత ఆహార పదార్థాలను తయారు చేసి ఉపాధి పొందాలని సూచించారు. డీడీఎంలు సుసీల్ తిమోతి, కృష్ణతేజ మాట్లాడుతూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. నాబార్డు సహకారంతో ప్రైమరీ ప్రాసెసింగ్ మెషినరీ ఇస్తామన్నారు. డాక్టర్ స్నేహలత, సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న నాబార్డు డీజీఎం శ్రీనివాసులు తదితరులు

క్లుప్తంగా

సుఖసంతోషాలతో ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): వినాయకుని దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం కౌడిపల్లి, భుజిరంపేటలోని పలు వినాయక మంటపాల వద్ద ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రవీన్ కుమార్, సత్తయ్య, శ్రీనివాస్, లింగం, దుర్గారెడ్డి, రాజిరెడ్డి, జగన్‌రెడ్డి, పోల నవీన్, మురళి, అనిల్, సంతోష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడ్ మండలం పెద్దతండాకు చెందిన సోమ్లానాయక్, వడిత్య వసంత్‌లు చిల్వెర ఐబీచౌరస్తా వద్ద గ్లామర్ బైక్, స్కూటీతో ఉన్నారు. అక్కడికి పోలీసులు రాగానే ఇద్దరూ పారిపోయారు. వారిని వెంబడించిన పోలీసులు సోమ్లానాయక్‌ను పట్టుకున్నారు. అతని వద్ద ఐదున్నర కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పారిపోయిన వసంత్ కోసం గాలిస్తున్నామని చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం అమ్మకాలపై కొత్తతరహా పోరాటం

జహీరాబాద్ టౌన్: బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాల నివారణకు మాజీ కౌన్సిలర్ బీఆర్‌ఎస్ నాయకుడు రాములు నేత కొత్త తరహా ఉద్యమం చేపట్టారు. బెల్టుషాపులు ఎత్తివేయాలని కోరుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు. శాంతినగర్‌లో గల్లీగల్లీకి బెల్టు షాపులు ఉండడంతో బెల్టు షాపులు ఎత్తివేయాలని వారం రోజుల నుంచి పోరాటం చేస్తూ కొత్తగా వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులో కాలనీ ప్రముఖులతో పాటు అన్నిశాఖల ఉన్నతాధికారుల నంబర్లను యాడ్ చేయించి మద్యం అమ్మకాలు అరికట్టాలని గ్రూప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులతో వారం రోజుల పాటు బెల్టుషాపులను మూయించారు. అయితే రెండు రోజుల నుంచి యథావిధిగా మద్యం అమ్మకాలు నడుస్తుండడంతో మరోసారి రాములు నేత పోరాటం ప్రారంభించారు. కాలనీ ప్రజలతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయిస్తున్నారు. ఉపాధ్యాయులు, స్కూల్ బోర్డుపై ఎక్సైజ్ ఎస్‌ఐ ఫోన్ నంబర్ రాయించి విద్యార్థులతో కూడా ఫోన్ చేయిస్తున్నారు. ఈ పోరాటానికి కాలనీ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

నాణ్యమైన విత్తనాలతో దిగుబడులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదుగేందుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని నూజివీడు సీడ్స్ సౌత్ ఇండియా ఉపాధ్యక్షుడు సతీష్ షా అన్నారు. మండలంలోని మిర్జాపూర్(ఎన్) గ్రామ శివారులో పత్తి పంట సాగు, విత్తనాల నాణ్యత తదితర అంశాలపై మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా షా మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసుకునే ముందు నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని నిరసన

సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్స్, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, నాయకులు గోపాల్, మంజుల, స్వప్న, ప్రభావతి, అంజమ్మ, సురేఖ, మనమ్మ, రేణుక, చిట్టెమ్మ, సుమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రంగనాయక సాగరం

- ఒకేచోట ఆధ్యాత్మికం.. ఆహ్లాదకరం
- ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్న పచ్చదనం
- ఉత్తమ పర్యాటక గ్రామంగా చంద్లాపూర్
- నేడు అవార్డు అందజేయనున్న కేంద్రం


గుట్టపై గరుత్మంతుడి విగ్రహం


చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక చెంతకు ఆహ్లాదం చేరింది.. భక్తి భావాల అంతరంగాలకు సాగర తరంగాలు తోడయ్యాయి. లక్ష్మీ రంగనాయక స్వామి వెలసిన ప్రదేశానికి జలహారం పడడం పండుగలకే పండుగైంది. ఫలితంగా చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. బుధవారం జాతీయ పర్యాటకదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం అవార్డు ప్రదానం చేయనుంది.

సిద్దిపేటకు 8 కిలోమీటర్ల దూరంలో చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులో లక్ష్మీ రంగనాయకస్వామి కొండ ఉంది. కొండపైన స్వామి వారు కొలువు దీరారు. ఆ భగవంతుడు ఆసీనుడైన చోట తన పేరిట రంగనాయక సాగర్ ఆవిర్భావం కావడం గ్రామానికి పెద్ద గుర్తింపు తెచ్చింది. ఆహ్లాద వాతావరణం, పచ్చటి పంటపొలాలు, ద్వీపాన్ని తలపించే సాగరం, అడుగడుగునా హరిత సంపద వంటి విశేషాల సమాహారం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. విజ్ఞాన యాత్రలకు నెలవుగా మారింది.

సైక్లింగ్, పరుగు పోటీలకు వేదికగా నిలచింది. రిజర్వాయర్ మధ్యలో ఉన్న 50 ఎకరాల స్థలం ఒక ద్వీపంగా దర్శనమిస్తుంది. అక్కడే గెస్టు హౌస్, ఎస్‌ఈ కార్యాలయాలు నిర్మించారు. సుడా ఆధ్వర్యంలో రిసార్ట్ ప్రారంభించగా, ఇటీవల ఫార్మసీ కళాశాల ప్రారంభించారు. ఇక్కడే పలు నర్సరీలు, పార్కులు కూడా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామం మొత్తం పచ్చదనంతో అలరారుతోంది. ప్రకృతి సహజత్వం ఉట్టిపడుతూ తీపి అనుభూతులను మదినిండా మూటకడుతుంది రంగనాయకసాగర్.. రంగనాయక స్వామి గుట్టపైకి కోటి రూపాయలతో చక్కని సీసీ రోడ్డు వేశారు.


బండరాయిలో వెలసిన రంగనాయక స్వామి విగ్రహం

పెద్దపెద్ద వాహనాలు సైతం గుట్టపైకి సులువుగా చేరేలా ఏర్పాటు చేశారు. గుట్టపై వివాహాలు చేసుకునేందుకు ఫంక్షన్ హాల్ కూడా నిర్మించారు. 68 అడుగుల గరుత్మంతుడి విగ్రహం భక్తులకు అదనపు ఆకర్షణగా నిలిచింది. అలాగే రిజర్వాయర్‌ను సందర్శించడానికి నిత్యం పర్యాటకుల తాకిడి పెరిగింది. దీంతో చంద్లాపూర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది.


రంగనాయక సాగర్ రిజర్వాయర్

సంతోషంగా ఉంది



రంగనాయక సాగర్ రిజర్వాయర్‌తో చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ట లభించింది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రిజర్వాయర్ నిర్మించడం, రంగనాయక స్వామి గుట్టను ఎంతో అభివృద్ధి చేయడంతో మా గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది.

– చంద్రకళ, సర్పంచ్

మంత్రి కృషితోనే గుర్తింపు...



మంత్రి హరీశ్‌రావు కృషి, పట్టుదల ఆయన అందించిన తోడ్పాటు వల్లే ఈ గుర్తింపు వచ్చింది. రంగనాయక స్వామి గుట్టతో పాటు రంగనాయక సాగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. అక్కడే ఫార్మసీ కళాశాల, నర్సరీలు, పార్కులు ఏర్పాటు చేయడంతో మరింత శోభ సంతరించుకుంది. గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది.

– రోజాశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


బస్వాపూర్‌లో పల్లె దవాఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం బస్వాపూర్ గ్రామంలో రూ.22లక్ష వ్యయంతో చేపట్టనున్న కంటి దవాఖానా భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా బస్వాపూర్ గ్రామంలో రూ.కోటీ ఐదు లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రె శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, రైతు సమన్వయ మండల కోఆర్డినేటర్ పేర్యాల రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ కనకయ్య ఉన్నారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన ఇద్దరికి సిద్దిపేట కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన జి.శివ, టి.వెంకటేష్‌లు నాలుగు రోజుల క్రితం మద్యం సేవించి పట్టణంలో ప్రజలను ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి మంగళవారం వారికి ఆరు రోజుల జైలుశిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..


అజయ్(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మాలపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శనిగరం భిక్షపతి, భారతి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్(24) ఇంటర్ వరకు చదువుకుని తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తుంటాడు. మంగళవారం పశువులకు మేత వేసేందుకు వెళ్లిన అజయ్ పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న బావిలో కాలుజారి పడిపోయాడు. పొలం దగ్గరకు వెళ్లిన కొడుకు తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు వెతికారు. బావిలో చూడగా చెప్పులు కన్పించాయి. స్థానికులు బావిలోకి దూకి అజయ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



వెరీ కాస్ట్‌లీ గురూ..!

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినాయక నవరాత్రి ఉత్సవంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని శ్రీపార్వతి మాత ఫ్యామిలీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపంలో గణనాథుని విగ్రహాన్ని రూ.15లక్షలతో అలంకరించారు. రూ.500 నోట్లు రెండు లక్షలు, రూ.200 నోట్లు రెండు లక్షలు, రూ.100 నోట్లు మూడు లక్షలు రూపాయలు, రూ.50 నోట్లు 3లక్షలు, 20 నోట్లు 4లక్షలు, రూ.10నోట్లు లక్షతో అలంకరించారు. ఈ ధన వినాయకుడిని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఎమ్మెల్యేల స్కీమ్‌గా 'దళితబంధు'


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

మెదక్ కలెక్టరేట్: దళిత కుటుంబాలన్నింటికి దళిత బంధు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట వెల్దుర్తి మండలం రామాయపల్లి, ధర్మారం గ్రామాల దళితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. దళితబంధు ఎమ్మెల్యేల స్కీమ్‌గా ప్రచారం జోరుగా సాగుతుందన్నారు. నాయకులు తమ బినామీలకు, అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే దళితబంధు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన దళితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉపకులాల బుడగ జంగాల, మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్, కృష్ణ, సుధాకర్, యాదగిరి, నర్సింలు, రాములు, పోచయ్య, సాయిలు, గట్టయ్య, లింగం, కిషన్, శేకులు, గట్టయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు నుంచి కిందపడి..

కొల్చారం(నర్సాపూర్): ఇంటి పైకప్పు సర్దుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నెల్లి సంగమేశ్వర్(35) ఈనెల 24న ఇంటిపై ఉన్న రేకులను సర్దుతుండగా కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగమేశ్వరుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో..

యువకుడి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన జక్కుల లాలు(29)తో పాటు అదే గ్రామానికి చెందిన రాము, ఏగొండ నరేశ్‌లు సోమవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యామ్‌లో కరెంటు షాక్‌తో చేపలు పట్టేందుకు వెళ్లారు. లాలు నీటిలోకి దిగి చేపలు తీస్తున్న క్రమంలో విద్యుత్ ప్రసారం అవుతున్న వైరు అతని కాలికి తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతన్ని మెదక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అమర్ తెలిపారు.


లాలు మృతదేహం

మద్యం తాగొద్దని మందలించినందుకు..

వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): మద్యంకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ మండల ర్యాలమడుగు పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన శివారి గంగయ్య(45) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. మందు కోసం డబ్బు కావాలని భార్య సిద్దమ్మతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి రోజూ తాగితే ఎలా అని భర్తను భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గంగయ్య గ్రామంలోని దుర్గమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్దకు వెళ్లాడు. తెల్లవారుజామున అందరూ ఇంటికి వెళ్లిన తర్వాత ఆలయ గేటుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలాన్ని మెదక్‌రూరల్ ఎస్‌ఐ అమర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్..

యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


అభిజిత్ బర్మన్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. అస్సాం రాష్ట్రంకు చెందిన అభిజిత్ బర్మన్(24), కర్మకర్(21) బతుకుదెరువు కోసం తొమ్మిది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చారు. వీరి రాష్ట్రానికి చెందిన వారు ఉంటున్న భవనంలో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. మంగళవారం పని కోసం బైక్‌పై ఇద్దరు లక్డారం వైపు వెళ్లారు. ఓ పెట్రోల్ బంక్ లో పని మాట్లాడుకుని తిరిగి ఇస్నాపూర్ వైపు వస్తున్నారు. డీమార్ట్ గోదాం సమీపంలో రాగానే వీరు వస్తున్న బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. దీంతో అభిజిత్ బర్మన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన కర్మకర్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అభిజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

మహిళా సాధికారతే కేసీఆర్ లక్ష్యం

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మహిళలను అన్నిరంగాల్లో ముందు నిలపాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోటిలింగాల దేవాలయంలో మహిళా పొదుపు సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఎంపీల పోరాట ఫలితమే పార్లమెంటు సమావేశాల్లో 33శాతం మహిళా బిల్లు అమలు చేశారన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు రూ 5లక్షలు రుణాలు మాత్రమే ఇచ్చేవని, ప్రస్తుత ప్రభుత్వం రూ.20 లక్షల వరకు అందిస్తున్నారని తెలిపారు. సీఏలు, సీసీల సమస్యను సీఎం పరిష్కరించారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల మాదిరిగా తమకు డ్రెస్ కోడ్ కావాలని మహిళా సంఘాలు కోరగా పరిశీలిస్తామని వారికి హామీనిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1070మంది యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. అంతకుముందు కోటిలింగాల దేవాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ మనోహర్‌రావు, ఏపీడీ రవీందర్, పీడీఎం రాజయ్య, శ్రీకాంత్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కొమురయ్య, యాదగిరి, రాంరెడ్డి, కనకయ్య, రాంరెడ్డి, అరుణ్‌కుమార్, గోవర్దన్‌రెడ్డి, ఎల్లం, నర్సింలు, మల్లయ్య, కలీముద్దిన్, శ్రీధర్, పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎండీ అహ్మద్, ఎనగంటి కిష్టయ్య, రాజు పాల్గొన్నారు.

భారతి అల్ట్రా ఫాస్ట్‌తో దృఢ నిర్మాణాలు


సదస్సులో పాల్గొన్న భారతి సిమెంట్ ప్రతినిధులు

మెదక్ కలెక్టరేట్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్ లోని శ్రీ రామలింగేశ్వరా ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ.. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 11 దేశాలలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ను తెలంగాణ లో విడుదల చేసినట్లు తెలిపారు. కాంక్రీట్ తయారీలో ఉపయోగించే నూతన టెక్నాలజీ, దృఢమైన కాంక్రీట్‌ను తయారు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ రకాల కాంక్రీట్‌ల గురించి ఇంజనీర్లకు క్లుప్తంగా వివరించారు. మార్కెట్ లో లభించే ఇతర సిమెంట్ తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణం యొక్క దృఢత్వం చాలా అధికంగా ఉంటుందని తెలియచేశారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలియచేశారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ గంగాధర్ రెడ్డి, డీలర్ లింగమూర్తి, స్థానిక ఇంజనీర్లు పాల్గొన్నారు.